క్లుప్తంగా

పీఏసీఎస్ సమావేశం



మాట్లాడుతున్న చైర్మన్ జగన్నాయకులు

సంతబొమ్మాళి: మండల కేంద్రంలోని పీఏసీఎస్‌లో సర్వసభ్య సమావేశాన్ని పీఏసీఎస్ చైర్మన్ కెల్లి జగన్నాయకులు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. సమావేశంలో 2022-23కు సంబంధించిన జమా ఖర్చులు, లోన్స్ రెన్యువల్స్, అలాగే 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఎరువుల పంపిణీ, రుణాలు ఇతర అంశాలను చర్చించారు. సమావేశంలో పీఏసీఎస్ కమిటీ సభ్యులు పిలక రవికుమార్ రెడ్డి, మార్పు నాగభూషణరావు, సీఈవో మాధురి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ ఆపన్న హస్తం



ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్‌జీఎఫ్ సభ్యులు

కవిటి: మండల కేంద్రానికి చెందిన జగన్నాథ్ బెహరా ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స తీసుకుంటూ ఇంటికే పరిమితమయ్యాడు. దీంతో ఆ కుటుంబం ఆర్థిక పరిస్థితి తెలుసుకున్న ఎస్‌జీఎఫ్ సంస్థ సభ్యులు ఆపన్న హస్తం అందజేశారు. సంస్థ తరఫున తాము సేకరించిన రూ.7,000 ఆర్థిక సాయాన్ని శుక్రవారం ఆ కుటుంబానికి అందజేశారు. సంస్థ సభ్యులను సర్పంచ్ పూడి లక్ష్మణరావు అభినందించారు.

స్వర్ణామృత ప్రాశన చుక్కలు పంపిణీ



విద్యార్థులకు చుక్కలు వేస్తున్న సర్పంచ్ బృందాదేవి

సంతబొమ్మాళి: మండలంలోని నౌపడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దీర్ఘాయువు ఆయుర్వేద కేంద్రం ఆధ్వర్యంలో వికాస తరంగిణీ ద్వారా స్వర్ణామృత ప్రాశన చుక్కలను శుక్రవారం వేశారు. సర్పంచ్ పిలక బృందాదేవి చేతులమీదుగా కార్యక్రమం ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పదహారేళ్ల లోపు విద్యార్థులకు ఈ ఆయుర్వేద ఔషధం వేయడం వల్ల జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. అలాగే రోగనిరోధక శక్తి పెంచుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో వికాస తరంగిణీ సభ్యులు పి.రవికుమార్‌రెడ్డి, వి.వాసుదేవరావు, బి.సోమేశ్వరరావు, ఎస్.తిరుపతిరెడ్డి, హెచ్‌ఎం అప్పలరాజు పాల్గొన్నారు.

తెలుగు మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు మెటీరియల్స్ అందజేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం రూరల్: మండలంలోని కొళిగాం, బిర్లంగి ఉన్నత పాఠశాలల్లో ఒడియా మాధ్యమంలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు ద్వితీయ భాష తెలుగు మెటీరియల్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు. హిందీ గ్రేడ్ 1 పండితుడు నరేంద్రనాథ్ పట్నాయక్ సొంతంగా తయారు చేసిన ఈ బుక్‌లెట్‌ను శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు శేషగిరిరావు, వాసంతి పట్నాయక్‌ల చేతులు మీదుగా విద్యార్థులకు అందజేశారు. అలాగే విద్యార్థులకు పరీక్ష సామాగ్రి అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాణి బెహరా, తిరుపతిరావు, మునిచంద్ర, ప్రశాంత్, లక్ష్మీకాంత్ బెహరా, జనార్ధన్, తిరుమలరావు, రామినాయుడు, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం



శాసనాంలో మాట్లాడుతున్న ఎంపీపీ పుష్ప

ఇచ్ఛాపురం రూరల్: చిరుధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ బోర పుష్ప, ఏసీడీపీవో వై.లావణ్య అన్నారు. మండలంలోని శాసనాం, పాయితారి, కేశుపురం అంగన్‌వాడీ సెక్టారు పరిధిలో పౌష్టికాహార పక్షోత్సవాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా కలిగే ప్రయోజనాలను వివరించారు. చిరుధాన్యాలతో తయారు చేసిన వంటకాలను ప్రదర్శించారు. కార్యక్రమాల్లో సర్పంచ్‌లు కారంగి త్రినాథ్‌రెడ్డి, సంతోష్ మండలా, వలపల రంజిత, ప్రియా లలితా నాయక్, రామచంద్ర పాడి, సూపర్‌వైజర్ నీలవేణి, మహిళా పోలీసులు షేక్ మదర్బీ, సవర ప్రమీళ, కార్యకర్త సూరు లలిత తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి ప్రాధాన్యం

కంచిలి: వ్యవసాయానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. మండలంలోని బొగాబెణి గ్రామానికి చెందిన ఆర్‌బీకే ద్వారా రామలింగేశ్వర గ్రూప్‌కు సబ్సిడీ ద్వారా మంజూరైన ట్రాక్టర్, రొటవేటర్లను శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఆర్‌బీకే అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో, సర్పంచ్ గణప సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం లక్ష్యం



కోటబొమ్మాళి: మహిళలకు చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ తదితరులు

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- ఘనంగా ఆసరా సంబరాలు

కోటబొమ్మాళి: మహిళా సాధికారతే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో 38 పంచాయతీల్లోని 1,393 డ్వాక్రా సంఘాలకు రూ.8.43 కోట్ల ఆసరా మూడో విడత నిధులు మంజూరయ్యాయన్నారు. మహిళా సంక్షేమానికి నిరంతరం పాటుపడుతున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని కోరారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ దువ్వాడ వాణి, వైస్ ఎంపీపీలు బోయిన నాగేశ్వరరావు, దుక్క రోజా రాణి, వైఎస్సార్‌సీపీ వికలాంగుల విభాగం జిల్లా అధ్యక్షుడు అట్టాడ మురళీమోహనరావు, తహసీల్దార్ జామి ఈశ్వరమ్మ, ఇన్‌చార్జి ఎంపీడీవో నిశ్చల, వెలుగు ఏసీ శ్రీరాములు, ఏపీఎం కెల్లి రాము, మండల కో–ఆప్షన్ సభ్యుడు రంజాన్‌రాజు బాయ్, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, సుంకరి జనార్దన, కాల్ల సంజీవరావు, అల్లు కల్యాణి, ఎంపీటీసీ బొడ్డు అప్పన్న, బొడ్డు చెంచు తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: ఆడపడుచులకు అండగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలుస్తున్నారని వైస్ ఎంపీపీ తమ్మినేని శ్రావణి అన్నారు. మండలంలోని బెండి పంచాయతీ మహదేవిపురంలో ఆసరా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల ప్రధాన కార్యదర్శి తమ్మినేని శాంతారావు, ఉప సర్పంచ్ టి.సుశీల, సీఎఫ్ దివ్వల శశిదేవి, గ్రామ సంఘం అధ్యక్షురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు. అలాగే కొత్తపేటలో సర్పంచ్ అంబటి శ్రీను ఆధ్వర్యంలో ఆసరా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో సీసీ ఐ.ధనలక్ష్మి, ఎస్.యోగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి

మందస: మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని డీఆర్‌డీవో ప్రాజెక్టు డైరెక్టర్ విద్యాసాగర్, ఎంపీపీ డొక్కరి దానయ్య, మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు సతీమణి సీదిరి శ్రీదేవి అన్నారు. పట్టణంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు ఏపీఎం గొడబ ప్రసాదరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. మండలంలోని 1,577 సంఘాలకు రూ.9.16 కోట్ల చెక్కు అందజేశారు. అనంతరం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సవర చంద్రమ్మ, వైస్ ఎంపీపీ సీర ప్రసాద్, కొర్నాని ఆదినారాయణ, మందస సర్పంచ్ చెరుకుపల్లి యల్లమ్మ, ఎంపీటీసీలు కంచిబెహరా, దువ్వు గౌరమ్మ, మందస, బాలిగాం పీఏసీఎస్ చైర్మన్లు అగ్గున్న సూర్యారావు, సాత్ర ఢిల్లేశ్వరరావు, తహసీల్దార్ బడే పాపారావు, ఎంపీడీవో వాయలపల్లి తిరుమలరావు, డీపీఎం రమణ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు బల్ల లీలాకుమారి తదితరులు పాల్గొన్నారు.

సోంపేట: రాష్ట్రంలో మహిళలకు ఆర్థిక భరోసా కల్పించడమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ ఆధ్వర్యంలో వైఎస్సార్ ఆసరా సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాస్, జెడ్పీటీసీ తడక యశోద, రెడ్డిక కార్పొరేషన్ చైర్మన్ దుక్క లోకేశ్వర్ రెడ్డి, సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్ రెడ్డి, మత్స్యకార కార్పొరేషన్ డైరెక్టర్ మద్దు రాజారావు, మండల కమిటీ అధ్యక్షుడు తడక జోగారావు, ఎంపీటీసీ పాడుగు కామేష్, ఎంపీడీవో బెందాళం వెంకటరమణ, ఏపీఎం రమణమ్మ పాల్గొన్నారు.



సోంపేట: సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు తదితరులు

కాశీబుగ్గ: పలాస మండలం లక్ష్మీపురం పంచాయతీ కిష్టుపురం గ్రామంలో సీఎం చిత్రపటానికి మహిళలు పాలాభిషేకం చేపట్టారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గండు మోహన్‌రావు, సీసీ రేణుక, వీవోఏ డి.స్వర్ణ, బూర్లె మహేష్, బూర్లె నరసింహులు, ఉప సర్పంచ్ బూర్లె శ్రీను తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

కవిటి: మండల కేంద్రంలో సోమవారం నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా సంబరాలను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ కవిటి మండల కన్వీనర్ కడియాల ప్రకాష్ కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో శుక్రవారం స్థల పరిశీలన చేశారు. ఆయనతో పాటు ఎంపీడీవో పి.సూర్యనారాయణ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

పలాస: స్థానిక జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా సంబరాలను విజయవంతం చేయాలని వెలుగు ఏపీఎం బి.మల్లేశ్వరరావు కోరారు. కార్యక్రమానికి మంత్రి సీదిరి అప్పలరాజు ముఖ్య అతిథిగా హాజరవ్వనున్నట్లు తెలియజేశారు.

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో శనివారం సాయంత్రం 2 గంటలకు నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా సంబరాలను విజయవంతం చేయాలని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పి.గురయ్యనాయుడు, వెలుగు ఏపీఎం జాంబవతిలు శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు, మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



కాశీబుగ్గ: కిష్టుపురంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



వజ్రపుకొత్తూరు: మహదేవిపురంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం



మందస: మహిళలకు చెక్కు అందజేస్తున్న దృశ్యం

‘అభివృద్ధి ఓర్వలేకే మంత్రిపై నిందలు’

వజ్రపుకొత్తూరు రూరల్: పలాస నియోజకవర్గంలో భూకబ్జాలపై టీడీపీ నిరాధార ఆరోపణలు చేస్తూ మంత్రి సీదిరి అప్పలరాజు ప్రతిష్టను దిగజార్చాలని చూస్తోందని, కానీ అది సాధ్యం కాదని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలిన శ్రీనివాసరావు, మండల ప్రత్యేక ఆహ్వానితుడు ఉప్పరపల్లి ఉదయ్ కుమార్, మండలాధ్యక్షుడు పి.గురయ్యనాయుడు అన్నారు. వజ్రపుకొత్తూరు వైఎస్సార్ సీపీ కార్యాలయంలో వారు శనివారం విలేకరులతో మాట్లాడారు. కబ్జాలపై మంత్రి రెవెన్యూ అధికారుల సమక్షంలో దర్బార్ నిర్వహిస్తే.. టీడీపీ నాయకులు మూకుమ్మడిగా నిరాధార అర్జీలు అందించారని ఆరోపించారు. గౌతు కుటుంబ 60 ఏళ్ల పాలనలో కబ్జాలు జరిగాయని, ఇప్పుడు మంత్రి వాటిపై విచారిస్తుంటే వారి గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయని అన్నారు. టీడీపీ పాలనలో పలాస నియోజకవర్గంలో అభివృద్ధి ఏ కోశానా జరగలేదని ఆరోపించారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత మంత్రి సీదిరి అప్పలరాజు కృషితో రూ. 700 కోట్లతో ఉద్దానం ప్రాంతానికి శుద్ధ జల ప్రాజెక్ట్ నిర్మాణం, రూ.50 కోట్లు వ్యయంతో కిడ్నీ రీసెర్చ్ సెంటర్‌తో పాటు 200 పడకల ఆస్పత్రి నిర్మాణం, సుమారు రూ.50 కోట్లతో వజ్రపుకొత్తూరు నుంచి అక్కుపల్లి మీదుగా కాశీబుగ్గ డబుల్ రోడ్డు, నువ్వలరేవు నుంచి టెక్కలిపట్నం వరకు మరో డబుల్ రోడ్డు నిర్మాణం జరుగుతోందన్నారు. ప్రజలు అంతా గమనిస్తున్నారని, రానున్న ఎన్నికల్లో పలాస నియోజకవర్గంలో 30 వేలు మెజారిటీతో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని జోస్యం చెప్పారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ వంక రాజు, పార్టీ నాయకులు మద్దిల హరినారాయణ,రత్నం దున్న బాలరాజు,జోగి అప్పారావు.తిర్రి రాజారావు, విఘ్నేష్ తదితరులు ఉన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్
- అక్కయ్యవలసలో గడప గడపకూ మన ప్రభుత్వం

కోటబొమ్మాళి: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని కొత్తపేట-1 సచివాలయం పరిధిలోని అక్కయ్యవలసలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. స్థానికుల సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో టెక్కలి జెడ్పీటీసీ దువ్వాడ వాణి, కార్యదర్శి బగాది సతీష్, వీఆర్వో కూర్మారావు, వైస్ ఎంపీపీ దుక్క రోజారాణి, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జి జి.నాగభూషణరావు, మండల కో–ఆప్షన్ మెంబర్ షేక్ రంజాన్‌రాజు, సర్పంచ్‌లు సుంకరి జనార్ధన, బమ్మిడి గణపతి, నూక సత్యరాజ్, సుంకరి జనార్ధన, నేతింటి అప్పలస్వామి, గొద్దు చిరంజీవి, బలగ సూర్యరావు, మెజ్జాడ శ్రీనివాస్, ఎంపీటీసీ చుక్క లోకనాథం, బొడ్డు అప్పన్న తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

‘రైతులంతా సీఎంకు రుణపడి ఉంటారు’

టెక్కలి: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన నూతన విధానంతో జిల్లా వ్యాప్తంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరిగిందని, రైతులంతా సీఎం జగన్‌కు రుణపడి ఉంటారని వ్యవసాయ సలహా మండలి జిల్లా బోర్డు సభ్యుడు కవిటి రామరాజు, టెక్కలి మండలం చైర్మన్ పినకాన వైకుంఠరావు అన్నారు. వారు శుక్రవారం టెక్కలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 744 రైతు భరోసా కేంద్రాల పరిధిలో సుమారు 1,25,302 మంది రైతుల నుంచి 5,42,991.64 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి చరిత్ర సృష్టించారని వారు పేర్కొన్నారు. మద్దతు ధర చెల్లించడంతో పాటు గోనె సంచులకు, రవాణా చార్జీలకు అదనంగా డబ్బులు చెల్లించారని చెప్పారు. టెక్కలి నియోజకవర్గంలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు విషయంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ నేరుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి మాట్లాడడం ప్రశంసనీయమన్నారు. రానున్న రబీ సీజన్‌కు సంబంధించి రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. ఎలాంటి దళారీ వ్యవస్థ లేకుండా రైతు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్ చేస్తున్న రైతు పరిపాలన పట్ల కొంత మంది దుష్ప్రచారాలు చేయడం దారుణమని వారు విమర్శించారు.



మాట్లాడుతున్న రామరాజు, వైకుంఠరావులు

ఎమ్మెల్సీ నర్తుకు శుభాకాంక్షలు

కవిటి: మండలంలోని కొత్తపుట్టుగలో ఎమ్మెల్సీ నర్తు రామారావును ఆయన నివాసంలో తహసీల్దార్ రాచర్ల అప్పలరాజు తన సిబ్బందితో శుక్రవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రామారావు మాట్లాడుతూ అధికారుల సహకారంతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి ఒక్కరూ సక్రమంగా పనిచేసి, ప్రభుత్వ లక్ష్యాలు సాధించాలని సూచించారు.



ఎమ్మెల్సీ రామారావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న తహసీల్దార్ అప్పలరాజు తదితరులు

నేత్రపర్వంగా నవరాత్రి వేడుకలు

కవిటి: మండలంలోని వివిధ గ్రామాల్లో శ్రీరామనవమి ఉత్సవాలు నేత్రపర్వంగా కొనసాగుతున్నాయి. రాజపురం, ఆర్.భైరిపురం, చండిపురం, కొత్తవరక, బొరివంక, జగతి, కవిటి గ్రామాల్లోని వివిధ ఆలయాల్లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చండిపురం రామాలయంలో సీతారాముల కల్యాణం కన్నులపండువగా చేపట్టారు. కార్యక్రమాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

శ్రీరాముని పట్టాభిషేకం

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ మెయిన్ రోడ్డులోని కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామ నవమి ఉత్సవాలు శ్రీరామ పట్టాభిషేకంతో ముగిశాయి. పండితులు రాంప్రసాద్ సిద్ధాంతి, పద్మకుమార్ ఆచారీలు పట్టాభిషేకం ఘట్టాన్ని భక్తులకు వినిపించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ సల్లా సుగుణ, దేవరాజు తదితరులు పాల్గొన్నారు.



కవిటి: చండిపురంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

స్టడీ మెటీరియల్ అందజేత

కంచిలి: మండలంలోని మకరాంపురం జెడ్పీహెచ్ స్కూల్‌లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు శ్రీవృక్ష విద్యాసంస్థ డైరెక్టర్ రమణమూర్తి, శోభన్‌బాబులు ఎంసెట్ స్టడీ మెటీరియల్ కిట్స్‌ను శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం డి.మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు


అసైన్‌మెంట్ ల్యాండ్ పరిశీలన



స్థల పరిశీలన చేస్తున్న జేసీ నవీన్‌కుమార్

నందిగాం: మండలంలోని చెరుకుపల్లికి చెందిన విశ్రాంత ఆర్మీ జవాన్ బమ్మిడి ధర్మారావు అసైన్ ల్యాండ్ కోసం 2017లో చేసుకున్న దరఖాస్తుకు జేసీ నవీన్‌కుమార్ స్పందించారు. ఈ మేరకు ప్రతాపవిశ్వనాథపురం పంచాయతీ చెరుకుపల్లిలో సర్వే నంబరు 6–3లో ఉన్న కొండను శుక్రవారం పరిశీలించారు. అనంతరం 4.5 ఎకరాలు ధర్మారావుకు కేటాయించాలని నందిగాం ఇన్‌చార్జి తహసీల్దార్ భాగ్యలక్ష్మికి సూచించారు.

సజావుగా సర్వసభ్య సమావేశం



మాట్లాడుతున్న చైర్‌పర్సన్ రాజలక్ష్మి

ఇచ్ఛాపురం: స్థానిక పురపాలక కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి అధ్యక్షతన సర్వసభ్య సాధారణ సమావేశం శుక్రవారం నిర్వహించారు. 14 అంశాలతో కూడిన అజెండాతో పాటు మున్సిపల్ ఆశీల బహిరంగ వేలంపాట ఆమోదం కోసం చర్చ నిర్వహించారు. ఏప్రిల్ 17వ తేదీ నుంచి జరగనున్న గ్రామ దేవత ఉత్సవాల దృష్ట్యా చేపట్టనున్న పనులకు ఆమోదం తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్, వైస్ చైర్‌పర్సన్లు ఉలాల భారతిదివ్య, లాబాల స్వర్ణమణి, కౌన్సిల్ సభ్యులు, కో–ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే కౌన్సిల్ సభ్యుల ప్రతిపాదన మేరకు చెరువుల లీజ్ ప్రక్రియను వాయిదా వేశారు.

3న ఉచిత కంటి వైద్య శిబిరం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధి పలాస సత్యసాయి మందిరంలో ఈనెల 3వ తేదీన ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

సంక్షిప్తంగా..

అధ్యక్షుడిగా వివేకానంద



టెక్కలి: స్థానిక కోర్టు సముదాయాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సీనియర్ న్యాయవాది దివ్వల వివేకానంద ఎన్నికయ్యారు. శుక్రవారం కోర్టు ఆవరణలో నిర్వహించిన అసోసియేషన్ ఎన్నికలో సమీప అభ్యర్థి బడే వెంకటరెడ్డిబాబుపై 19 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అలాగే కార్యదర్శిగా లుండు బాలకృష్ణ, ఉపాధ్యక్షునిగా దుంపల భుజంగరావు, సహాయ కార్యదర్శిగా దాడి ధర్మారావు, కోశాధికారిగా సానా రాజన్నాయుడు తదితరులు ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా పి.మధుబాబు, పి.బాబురావు వ్యవహరించారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి ఏపీపీ పి.వైకుంఠరావు పాణిగ్రహి, ఏజీపీ జి.కృష్ణారావు తదితరులు అభినందనలు తెలిపారు.

మహిళల భద్రత.. పోలీసుల బాధ్యత

ఇచ్ఛాపురం రూరల్: మహిళల భద్రత.. పోలీసుల బాధ్యత అని ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ కె.రామకృష్ణ అన్నారు. మండలంలోని ఈదుపురం గ్రామంలో పోలీసుల కళా బృందంతో స్ఫూర్తి నాటికను శుక్రవారం ప్రదర్శించారు. మహిళల రక్షణ కోసం తీసుకుంటున్న చర్యలు, ఆన్‌లైన్ వేధింపులు, ఈవ్ టీజింగ్ వంటి సన్నివేశాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్తు వరప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

కంచిలి: మండలంలోని జక్కర గ్రామానికి చెందిన బండి తిరుపతి కొద్దిరోజుల క్రితం చెట్టుపై నుంచి జారిపడడంతో మంచానికే పరిమితమయ్యాడు. దీంతో వైద్య ఖర్చుల నిమిత్తం సీడాప్ చైర్మన్ సాడి శ్యాంప్రసాద్‌రెడ్డి రూ.5 వేల ఆర్థిక సాయం శుక్రవారం అందజేశారు. ఆయనతోపాటు మండల వైఎస్సార్‌సీపీ నేత ఇప్పిలి కృష్ణారావు ఉన్నారు.

తక్షణ సాయం అందజేత

నందిగాం: మండలంలోని శివరాంపురం గ్రామానికి చెందిన పిల్లల రాము ఇటీవల మృతి చెందారు. దీంతో అతని భార్య లలితకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ పిన్నింటి జయరాం, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు చిన్ని జోగారావు, నాయకులు ఇప్పిలి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాలతో విద్య బలోపేతం

మందస: రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రభుత్వ విద్య బలోపేతమవుతోందని ఒడియా శ్రీకాకుళం జిల్లా డీఐ దుర్గాప్రసాద్‌గౌదరి, ఎస్ఐఎఫ్ఎస్ సీఈవో సునీల్‌మహంతి, ఎంఈవో ఎం.లక్ష్మణరావు అన్నారు. మండలంలోని పొత్తంగి-సిరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ విద్యకు రూ.కోట్లు చేర్పు చేస్తున్నారన్నారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చుతున్న పేద విద్యార్థులకు సునీల్‌మహంతి బహుమతులు అందజేశారు. సమావేశంలో సర్పంచ్ హేమలతసాహు, పీఎంసీ చైర్మన్ శివప్రసాద్‌మహంతి, హెచ్‌ఎం సీహెచ్ సత్యం తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ 19వ వార్డులో మున్సిపల్ అధికారులు శుక్రవారం ప్రత్యేక పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. లేబరు కాలనీ పరిధిలో ఉన్నటువంటి చెత్తను తొలగించి, డంపింగ్ యార్డుకు తరలించారు. పనులను వార్డు కౌన్సిలర్ అంబటి మాధురి, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి అంబటి ఆనందరావు తదితరులు పర్యవేక్షించారు.

‘ఎస్టీలుగా గుర్తించవద్దు’

మందస: బోయ, వాల్మీకి కులాలను ఎస్టీలుగా గుర్తించవద్దని గిరిజనులు కోరారు. ఈ మేరకు పట్టణంలోని శ్రీరాజా శ్రీనివాస స్మారక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు శుక్రవారం నిరసన ర్యాలీ చేశారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, నకిలీ బెంతు ఒరియాలపై 2017లో నియమించిన జేసీ శర్మ నివేదిక బహిర్గతం చేయాలని కోరారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ కె.విజయలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆదివాసీ వికాస పరిషత్, గిరిజన సంఘం నాయకులు సవర జగన్నాథరావు(జగన్), చంద్రరావు, సవర డొంబురు, సవర ధర్మారావు, సవర హరికృష్ణ, ఉమాబిస్వాల్, సవర నాగేశ్, ఉమాశంకర్, రైక రమ్యో, సవర బాలకృష్ణ, జేసుకేతన్, సవర విజయ్, అబ్రహం, గణేశ్వరరావు, చిత్రసేను, సవర సందేశు తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథులతో సమావేశం నేడు

కవిటి: వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయం ఆదేశాల మేరకు ఇచ్ఛాపురం పట్టణంలోని వైఎస్సార్ కల్యాణ మండపంలో నియోజకవర్గ స్థాయిలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులతో శనివారం సమావేశం నిర్వహించనున్నట్లు ఇచ్ఛాపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త పిరియా సాయిరాజ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఉదయం 10.30 గంటలకు నాలుగు మండలాలు, మున్సిపాలిటీ వార్డు, గ్రామ సచివాలయాలకు చెందిన బాధ్యులు, ముఖ్య నేతలు, పార్టీ శ్రేణులు సమావేశంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. జగనన్నే మా భవిష్యత్, గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాల నిర్వహణపై సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయనున్నట్లు తెలియజేశారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

టెక్కలి: మండలంలోని రావివలసలో ఉన్న 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనులు చేపడుతున్న దృష్ట్యా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈఈ వీపీ రాజశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు వెల్లడించారు. అంతరాయానికి వినియోగదారులంతా సహకరించాలని కోరారు.